


అనుకూల దాంపత్యాలు ప్రపంచంలో అరుదు. ఎక్కడో నూటికో కోటికొకటి. సంసారానికి మొగుడూ, పెళ్లాం అనేవి బండికి రెండు చక్రాలవంటివి. ఇవి ఒకే మార్గాన నడవాలి గాని, కాశ్మీర్ సమస్యలాగా, రెండు బాటల్లో విహరించగూడదు. సంసారం చేసినందువల్ల ప్రతిఫలం సుఖం దక్కటం. ఈ దాంపత్య సుఖంలో వున్న మజా చవి చూడవలసిందేగాని - ఒకరు చెబితే విని సంతోషించి పూరుకోనటానికి వీలు లేదు. జీవితాన్ని సుఖవంతం చేసికొనటం మన చేతిలో వున్నదని! ఆ టెక్నిక్ తెలియకుండా, సంసారం నడపటానికి పూనుకొనటం చాలా తప్పు.'

చీకటి తెరల్ని చీల్చుకుంటూ వచ్చిన సూర్యుడి లేత కిరణాలు తలుపులు సగం తీసివున్న కిటికీ గుండా వచ్చి తనమీద పడుతూన్న సమయంలో రామారావు యిట్లా అనుకున్నాడు తనలో తానే.

అతనొక కుర్చీమీద కూర్చున్నాడు. కాళ్లు ఎదురుగుండా వున్న టేబిల్ మీద వున్నాయి. వడిలో ఒక పుస్తకం వుంది. టేబిల్ మీద కొంత కాలం క్రితం ఆర్పివేయబడ్డ హరికేన్ లాంతరు వుంది. చేతిలో వున్న పెన్సిలు 'మొనతో తల గీరుకున్నాడు. ఏవో తీవ్ర సమస్యలకు' గురైన కారణాన మనసు ఆలోచనలతో కొట్టుమిట్టులాడుతూంది.

అతనట్లానే ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఎంతసేపట్లా ఆలోచిస్తాడో అతనికే తెలియదు. ఎందుకంత తీవ్రంగా ఆలోచించాలో కూడా అతనికి తెలియదు. కాని ఆలోచిస్తాడు-ఆలోచించటానికి సరిపడ్డ బలం, తూనికా అతనిలో వున్నంతకాలం!

ఇంతలో ఒక్క ఎలుక చూరులోంచి చప్పుడు చేసుకుంటూ బల్లమీదపడి-కిందికి జారిపోయింది. ఉలిక్కి పడ్డాడు. ఒకమారు గడియారం వంక చూచాడు. అబ్బా! అయిదు ముప్పావు. కుర్చీనించి లేచి గోడనున్న కాలెండరు కాగితం ఒకటి చించేశాడు. కొత్తకాగితం - మార్చి నెల గమనాన్ని చూపిస్తుంది.

“ శ్రీ విరించి ”

ఇవాళ ఫస్టు తారీఖు. ఇంకా పదునాలుగు రోజుల విరామం వుంది పరీక్షలకి - అనుకున్నాడు పైకి! మళ్లీ ఆ కుర్చీలోనే కూలబడ్డాడు నిస్సగ్గా!

ఈ సారన్నా పరీక్షల్లో ప్యాసు గాకపోతే మర్యాద దక్కదు. ఇప్పటికి రెండుసార్లయింది. అయిందంటే, ఆ తప్పంతా అతని భార్యమీదే పడింది. ఈ సారన్నా ఆ కాస్త పరీక్ష ప్యాసవకపోతే - తనకున్న మర్యాద కాస్త యిరుపక్షాల్లోనూ, నశించిపోతుంది. తన భార్యకూ భారం ఎక్కువౌతుంది. దాంతో దానికి యిది వరకు తనంటే వున్న అభిమానం నిర్వీర్యమై పోతుంది. చదవాలంటే — దానిమీద శ్రద్ధ తగ్గి పోతూంది. వయసు ఒక సంవత్సరానికి ఒక సంవత్సరం వచ్చిన కొద్దీ బద్ధకం ఎక్కువవుతోంది.

* * *

రామారావు యింటర్లో వుండగా జానకి అత్తవారింటికొచ్చింది. ఎవరితప్పయితేనేం అతను పరీక్ష తప్పాడు.

పెళ్లాం కాపురాని కొచ్చిందనగానే, ఏదో ఓ ఉద్యోగం చూసుకోవాల్సిన అవసరం కలిగింది తప్పనిసరిగా. ఎమ్మేలు-బియ్యేలు ప్యాసైన వాళ్లే వుదరపోషణ నిమిత్తం రెక్కలు గట్టుకుని తిరిగితిరిగి విఫలులై పోతూన్న యీ కాలంలో — యింటరు తప్పిపోయిన రామారావుకు వుద్యోగం ఎక్కడా దొరకలేదంటే కించిత్తయినా, ఆశ్చర్యపడాల్సిన విషయం కనిపించదు. అయినా ఆకలిగా వున్నవాడికెక్కడో ఒకచోట అన్నం దొరక్కపోదు-గట్టి యత్నం చెయ్యాలిగాని. ఎంత ప్రయత్నించినా తిండి దొరకనివాడు 'ఆకలే' పడకూడదు. దేవుడు లాగా, ఎవరో కనిపించడం 'నాయనా నువ్వు కూడు లేకుండా బాధపడితే నేను చూడగలనా?' అని చెప్పి ఏదో వృత్తి కలిగించటం పరిపాటి.

అతికష్టంపై తాలూకాఫీసులో చిన్న గుమాస్తాగా ప్రవేశించిన రామారావుకు నిలవ నీడ దొరికినట్లయింది.

వస్తూన్న రాబడితో తనూ తన భార్యా మధ్యమంగా కుటుంబాన్ని పోషించుకుంటూ రావచ్చు. చాలావరకు- చాకచక్యం వలననైతేనేమి- తెలివితేటలవల్ల నైతేనేమి తోటి వాళ్లల్లో మెరుగనిపించుకుని అధికార్ల మన్ననలకు పాత్రుడయ్యాడు.

ఇంటరెట్లాగూ చదవనే చదివాడు గనుక, అది పూర్తి చేసి- బి. యే. పరీక్షకు ప్రయివేటుగా అప్పియరై. డిపార్టుమెంటల్లు పరీక్షలకు కూడా కట్టి ప్యాసైతే, తాసీల్దారీ డిగ్రీకయినా కనీసం రావచ్చునన్న ఆశ అతనికి కలిగించారు నలుగురూ. నిజానికి, అతని ఆలోచనల్లకు, యీ పద్ధతి అనుసరణీయంగానే వుంది. కొద్దిరోజులు పాటు కష్టపడినా- తన శక్తికి మించిన పని చేయవలసి వచ్చినా, తరవాత్తరవాత, తన కనుభూతం అయ్యే సుఖాలముందు యివన్నీ ఎన్నోవంతు! ఈ రోజుల్లో బి. యే అనన్నా అనిపించుకోకపోతే, ఏంబాగు? గౌరవం పొందటానికి ప్రతివాడూ ప్రయత్నిస్తాడు సంఘంలో, సమాజంలో.

ఆ యింటరు పూర్తి చేయటానికే యిప్పుడితను పడే తంటాలంతా! పరీక్షలింకా నెల్రోజులున్నాయనగా, సెలవుపెట్టాడు వుద్యోగానికి. ఆదివరలో అంటే విద్యార్థిదశలో వున్నాడు గాబట్టి- తప్పినా, తన్నినా, తప్పేమీ లేదు. ఇప్పుడింత హోదాలో వున్నవాడు, ముందు ముందు అభ్యుదయమార్గానికి సోపానాలు వేస్తూన్నవాడు పెధవపరీక్షల్లో తప్పిపోతే మరేమన్నావుందా? అందరూ నవ్వుతారు. అయినా తనకే సిగ్గుచేటు! నలుగుర్లో తలెత్తుకు తిరగ్గల యోగ్యతేమయినా మిగులుతుందా? ఎవరో అంటారని యెందుకూ? పరీక్షల్లో తప్పితే- తాసీల్దారీ ఎట్లా? దానికి హస్తోదకం వదలటానికి ఎట్లా మనస్కరిస్తుంది?

అందుకనే పరీక్షలో ప్యాసవాలి- అందుకు యింత తంటాలూ పడాలి!

ఈ పరీక్షలు బలే మోసపువ్యవహారాలు. ఫలానిది ముఖ్యం అని చదవడానికి వీల్లేదు. ఇది ముఖ్యంగాదని చెప్పి తోసిపారేయడానికీ వీల్లేదు. అట్లా యేదన్నా తోసేస్తే, సరిగ్గా అవ్వే సాక్షాత్కరిస్తాయ్ పరీక్షాపత్రంలో. అందుకని ప్రతిదీ పుస్తకాల్లోని ప్రతిముక్కా చదివిరాలి!

ఇటువంటి వుద్దేశ్యాల్తో అతనిబుర్ర గిరగిర తిరిగిపోతోంది. ఇప్పట్లో అతనికని వుద్దేశించ

బిడ్డ కర్తవ్యాలు రెండే రెండు. మొదటిది చదువు, రెండోది సంసారం.

ఇందులో యే వొక్కదాన్లోనూ అతను తనున్నంత అభ్యుదయ పథాన్న నడవలేక పోవటానికి కారణం అతనికి గోచరించడం లేదు.

ప్రతివాడిలోనూ, కొన్ని దౌర్బల్యాలు వుంటాయని అతనికి తెలుసు. ప్రతివాడూ వాటిని మార్చుకోవాలనీ అతనికి తెలుసు. అయితే తనలో వున్న దౌర్బల్యాలు యేమిటో తెలియటం లేదు తనకే !

తన భార్యనడిగితే యేమంటుంది? పాపం, జానకి పట్టి అమాయకపు పిల్ల- దానికింకా ప్రపంచం అంటే యేమిటో అర్థంగాదు. 'ఆ-మీ పిచ్చిగాని, మీకేంలోటండి-' అంటుంది. చిత్రం!

మరెవరు చెబుతారు- స్నేహితులా- అధికారులా...?

* * *

ఇంతవరకు కుర్చీలోనే కూర్చునున్న రామారావు వళ్లు విరుచుకుంటూ మళ్ళీ లేచాడు. ఒకసారి యింటిలోనికి వెళ్ళి చూచాడు. జానకి పొయ్యి రాజవేస్తూన్నది. కూట్లోనుంచి ఒక వేపపుల్లలాగి, దొడ్లోకెళ్ళి దంతధావనం కానిచ్చాడు.

అతను స్నానంచేసి- మళ్లీ గదిలోనికొచ్చి కూర్చున్నాక- జానకి కాఫీగ్లాసు తీసుకుని గుమ్మందగ్గరే నిలువబడింది. రామారావు తలెత్తి చిరునవ్వుతో లోనికిరమ్మన్నట్లుగా తలూపాడు.

టేబుల్ మీద గ్లాసు పెట్టేసి- వెనక్కు వెళ్లబోయింది జానకి!

'ఇదిగో, చూడు' అన్నాడు. అతనివైపు తిరిగి 'యేమిటి' అన్నది.

'ఇవ్వాళ...' ఎం చేతనో మాట గొంతుక దాటి సాఫీగా రావడం లేదు అతనికి.

'ఏమున్నై?' అన్నాడు బలవంతాన.

జానకి జవాబుకోసం గాబోలు ఆలోచనలోకి దిగింది.

ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ- 'బజారుకు వెళ్ళి యేమయినా తెమ్మంటావా?' అన్నాడు. చటుక్కున జానకి- 'ఇప్పుడు బజారుకేం వెడతారులెండి- వీధిలోకొస్తే యేమన్నా కొంటాను-' అంది.

'ఎంతసేపు! ఒక్క...'

'ఆ! చదువుకుందురూ - మునిగిపోయింది-' అంటూనే జానకి గదివదిలి వెళ్లిపోయింది.

జానక్కు యెంత శ్రద్ధ తన చదువుమీద! ఒక్క క్షణం వృథా చేయనియ్యదు. ఈ మాటలనుకుంటే, అతని హృదయాన ఎంతో వుబికి వస్తోంది ఆనందం! మళ్లీ తనచదువు తల్చుకుంటే విషాదం కమ్ముకొచ్చి- ప్రారబ్ధానికి అంజలి చేస్తూ కుర్చీలో కూలబడ్డాడు.

రామారావు కాఫీ త్రాగాడు. కాఫీ అతనికి చిన్నప్పటినుంచీ అలవాటుగాదు. మధ్యలో అయింది. అదుగో ఆ రామనాథం అలవాటు చేశాడు తనకు దీన్ని. మూర్ఖులు ఫైనలు చదువుతున్న రోజుల్లో రోజూ వాళ్ళ యింట్లో కాఫీ తాగటం తప్పనిసరి అయింది- పరీక్షల సమయంలో. అబ్బే- ఎన్ని రోజులు? - సరిగా పదిహేను రోజులు.

ఆపదహేరోనాడు వుదయం ఎనిమిదింటికే మొదలయింది తలనొప్పి. ఆ పొద్దినుంచీ తన యింటోనూ మొదలు బెట్టించాడు. తనకెట్లాగో అలవాటయింది, అంతటితో వూరుకున్నాడా? అహఁ లేదు. జానకిని రోజూ బలవంతం చేసేవాడు కాఫరాని కొచ్చిన కొత్తలో కాఫీతాగమని! ఇప్పుడు తనయినా కాఫీ త్రాగకుండా వుండగలడేమో గాని, ఆది వుండదు. అయిందా.

అయినా, కాఫీ అనేది తాగాల్సిన పదార్థమేనని వాదిస్తాడు తాను అవసరమయితే.

కాఫీగ్లాసు టేబులుమీద పెట్టేసి, కుర్చీలో జారగిలాడు, అందుబాట్లో వున్న పుస్తకం తెరచి కళ్లముందు పెట్టుకున్నాడు. ధ్యానంతా దానిమీదే నిలిపి, ఏకాగ్రతతో కనీసం భోజనం చేసేదాక నయినా చదవాలని అనుకున్నాడు. మహాగట్టిగా, బుర్రంతా పుస్తకం మీదికి వంచేసి లైన్లకి లైన్లే చదివేస్తున్నాడు.

పదినిముషాలు గడిచాయి. రామారావు విసుక్కున్నాడు. ప్రత్యేకంగా గది యేర్పాటు చేసుకున్నా తనకు చదువు సరిగ్గా సాగనందుకు. పక్క గదిలో జానకి ఎవరితోటో మాట్లాడుతూండటం అతనికి వినిపిస్తూన్నది. 'ఎవరా' అని విన్నాడు. పక్కింటి పిల్ల శ్యామల. జానకితో స్నేహం. అప్పుడప్పుడూ తీరిక సమయాల్లో మాట్లాడ

టానికి వస్తూంటుంది. శ్యామల భర్త 'యిన్సూరెన్సు యేజంటు' మంచి కాన్వాసరుగా పేరు పడ్డవాడు. వాళ్ళ దాంపత్య జీవితం చాలాబాగా కొనసాగుతున్నదేమో!...

తన మనసు చాలా కొద్దిసేపట్లో విషయాంతరాలమీదికి దూకి, చర్చించటం అతనికి కష్టం కలిగించింది. మళ్ళీ పుస్తకంలోని పంక్తులమీదికి దృష్టి సాగించాడు. శ్యామల మీద అతనికి కోపమే వచ్చింది.

తిరిగి ఓ పావుగంట గట్టి చదువు అయినాక, జానకిని పిల్చాడు. జానకి పరాగ్గా వచ్చి అతని పక్కని నిలువబడింది

'ఇందాక ఎవరో వచ్చింది?'

'ఏం-అట్లా అడుగుతున్నారు?'

ఇటువంటి సమాధానాలు అతనికి చాలా చిరాగ్గలిగించేవి మొదట్లో. ఒకప్రశ్న వేసినప్పుడు మరో ఎదురు ప్రశ్న వెయ్యటం ఎవరైనా గాని అతనికి యిష్టంగాదు, అందునా అతని భార్యే!

ముఖ్యంగా ఆడవాళ్ళకు వున్న దుర్గుణాల్లో యిదొకటి! ప్రశ్నకు ప్రశ్న వేసి, ఆ ఎదురుప్రశ్నలకు విలువ గలిగితే కాని, మగవాడి మొదటి ప్రశ్నకు జవాబు చెప్పరు. వాళ్ళ మనస్తత్వానికి అనుగుణంగా మగవాళ్ళు తమ అభిప్రాయాలు మార్చుకోవాలి. లేకపోతే పేచీలు తప్పవు.

'ఆహాఁ. ఏం లేదు వూరికేనే—'

జానక్కి రామారావు తత్వమూ తెలుసు గనక యింకా అతనికి చిరాగ్గలిగించకుండా, సరయిన జవాబుచెప్పి వూరుకుంది.

'ఏం పొద్దుణ్నే - పని లేక వచ్చిందా యేమిటి?...'

'మీరట్లానే అంటారు - పని లేక రావటమేమిటండీ? పక్కపక్క యిళ్ళ ఆడవాళ్ళం మాట్లాడుకోకుండా వుంటామా? ...' అంది జానకి చిరుకోపాన్ని ప్రకటిస్తూ.

'ఏం తెచ్చిందేమిటి?' ఆడవాళ్ళ నోళ్ళల్లో నువ్వుగింజ దాగదు. ఏదేనా విషయం వాళ్ళకు తెలిస్తే-తమకు తెలిసిన వాళ్ళతో చెప్పకుండా వుండలేరు. వెంటనే...'తోటకూర...' అంది.

జానకిని యింకా వాగిద్దామనుకున్న రామారావుకు ఆశాభంగమే కలిగింది.

ఏ వార్త తెచ్చిందన్నట్టయితే-దాని వివరాలు అడిగి, ఆరాలుతీసి కొంత కాలయాపన చేయగలిగేవాడు.

'అహా! ఈ వాళను యేమీ కొనకుండా సరిపోయిందన్నమాట! అన్నాడు.

'సర్లెండి - నన్నెందుకు పిలిచారు?'

'పిల్చానా? వూరక్కనే...'

'ఎందుకేండి కాలం పాడుచేసుకోటం...' జానకి మరి ఆ గదిలో వుండలా, రామారావు మరిమరీ పిలిచినా!

మరల రామారావు ఆలోచనలు శ్యామల మీదికి వెళ్ళాయి. ఇప్పుడు శ్యామల రావడం వల్ల తన చదువుకు అంతరాయమే కలిగింది. నిజానికి శ్యామల రావడం తనకిష్టం లేదు గనకనా, ఎంతో యిష్టం...

ఒకప్పుడు తను - శ్యామలనూ, జానకినీ- సామ్యం చేసి చూశాడు. ఎవరి రూపురేఖలు వాళ్ళవే ఎవరి లావణ్యాలు వాళ్ళవే. పోలికలు సున్నా. శ్యామల కొంచెం లావు తన భార్య కంటె. మళ్ళీ శ్యామల భర్తకూ, తనకూ తేడా చాలా వుంది. తానప్పుడప్పుడూ అనుకుంటూ వుంటాడు వాడు శ్యామలకు తగుడా అని. అప్పుడు తనకు శ్యామలమీద జాలి కలుగుతుంది.

సరిగ్గా రెండు సంవత్సరాలకింద... శ్యామల వీపుమీద చెయ్యివేశాడు-ఇద్దరి యిళ్ళకూ మధ్యనున్న చెట్లనీడల్లో. శ్యామల భయపడి ఇంట్లోకి వెళ్ళబోయింది. తన దగ్గరగా వెళ్ళి గాఢంగా కౌగలించుకున్నాడు... ఇదు మాత్ర పట్టు విదిలించుకుని యింట్లోకి వెళ్ళిపోయింది శ్యామల. తను బజారు కెళ్ళాడు.

అది జ్ఞాపకం వుందో లేదో శ్యామలకు! అవలా విషయం తన భార్యతో చెప్పిందేమో అదో గొప్ప నేరంగా భావించేదా. ఎట్లా తెలుస్తుంది? తనకు మాత్రం చీవాట్లు రావా? అయినా తనల్లా చేయటం శ్యామలకిష్టమే నేమో. లేకపోతే-ఆ నాటినుంచీ తన యింటికి రాకుండా, జానకితో మాట్లాడకుండా వుండేది గాదూ?... స్త్రీ హృదయం యిదమిత్థమని తేల్చి చెప్పటానికి వీల్లేదు.

మళ్ళీ తన దౌర్బల్యాన్ని గుర్తించటానికి అతనికి యిందాకటికంటె ఎక్కువసేపే పట్టింది.



ఆ మాట తెలియగానే, మళ్ళీ పుస్తకం అందుకున్నాడు.

చదువుమాట ఎట్లావున్నా సంసార విషయంలో అతన్ని బాధిస్తూన్న సమస్యలు రెండే రెండు. మొదటిది తన భావి జీవితాన్ని గురించి రెండోది, జానకి తనయందు విశ్వాస పాత్రంగావర్తిస్తోందా? అని.

తను శ్యాములను కౌగలించుకున్నట్టుగా, జానకిని ఎవరన్నా?

ఈ ప్రశ్నకు తన యిరు పక్షాలవారూ జవాబులు చెప్తారు అతని మనసులో.

ఏది నమ్మాలో, యేది విసర్జించాలో అతనికి అవగాహన కావటంలేదు.

అనుమానమనేది వుండకూడదుగాని, వున్నదీ అంటే భూతంలాగా వేధిస్తుంది. దానికి బానిసయిన వాడికిక స్వతంత్రమైన ఆలోచనలు నశించుతై. స్వప్రయోజకం నీరసించుతుంది.

జానకి స్త్రీ-స్త్రీబుద్ధి చంచలం. జీవితాంతం వరకూ ఒక్కడిమీదనే మోజు చూపిస్తుందక పోవటం తప్పుగాదు. తన భర్తకన్నా యే రెస్పెక్టుగానయినా గొప్పగాకనబడితే-స్త్రీకికోరిక కలుగుతుందని అతను చదివాడు పుస్తకాల్లో. ఇంకొక చిక్కొచ్చి పడుతోంది యిక్కడ. ఈ పుస్తకాల్లో అడ్డమైనవన్నీ రాసేస్తారు. అవన్నీ నిజమేనా!-అని.

'నిజమే అయివుండొచ్చు-స్త్రీ అట్లాంటిదే. నీకన్నా అన్ని రెస్పెక్టుల్లోనూ అందమయిన వాళ్లు లోకంలో బహుబోల్డీ-అయ్యో, ఖర్మమా నువ్వుత్త చవటవు. జానకి నిన్ను మోసం చేస్తోంది' అంటూంది ఒకపక్షం.

'జానకి నీకెప్పుడు లోటు కలిగించింది. పట్టి అమాయకపు పిల్లమీద నేరాలు వెయ్యటం తగునా?' అంటుంది రెండోపక్షం.

ఈ వూహాల్ని సమీక్షిస్తే అతనికి తేలిన ముక్క-జన్మలో యికెన్నడూ యిటువంటి విషయాలు చర్చించగూడదని! అయినా, యేం చేస్తాడు. మనో దౌర్బల్యం.

చదవాల్సిన అమూల్యకాలం యిలా వ్యయమైపోవడం శోచనీయమైన విషయం. కనుబొమ్మలు ముకళించి-ఒకవిధమైన గాంభీర్యాన్ని (ఎవరినో వుద్ధరించటానికి కన్నట్టుగా!) కొంగ్రొత్తదనాన్ని తెచ్చిపెట్టుకుని, నిరాశాభావాన్ని వెలువరిస్తూ-యెప్పుడో కరద్వయంనుంచి జారిపడ్డ పుస్తకాన్ని మళ్ళీ అందుకుని చదవడం ఆరంభించాడు.

ఈసారి నిమగ్నకనించి అతను తనంతట తాను యివతలబడలేదు. జానకే వంటయిందని చెప్పి-పిలిచింది, పదిగంటలు దాటగానే. వంటయిందన్న మాట వినగానే, అతనికి ఎక్కడలేని ఆకలి పుట్టుకొచ్చింది. ఒక్కసారి తానా పూట చదివేసిన కాగితాల సంఖ్య చూచుకున్నాడు.

'ఆ. ఫరవాలేదు-యీ మాత్రం చదివితే!' అనే ధైర్యం కనపరుస్తూ, కుర్చీనించి లేచి భోజనానికి వుపక్రమించాడు.

మధ్య గదిలో రామారావు మంచంమీద పడుకున్నాడు. జానకి కుర్చీమీద కూర్చుని తమలపాకు యీనెలు చీల్చి సున్నం రాసి యిస్తూంది.

కొంతసేపట్లాగయినాక, రామారావు 'కొద్ది సేపుపడుకోవాలే' అన్నాడు. జానకి మాటాడ లేదు.

అతనే మళ్ళీ అందుకుని 'నువ్వుకూడా కాస్సేపు నిద్రపో-బడలిక' అన్నాడు.

జానకి, వీధితలుపు గడియవేసివచ్చి తనూ ఓ మంచంమీద నడుం వాల్చింది. ఇద్దరూ నిద్ర పోయారు...

కొంతసేపయ్యాక జానక్కి ఎవరో తలుపు తట్టడం-పేరు పేరునా పిలవడం వినిపించింది.

ఎవరో కొత్తమనిషి రైలునుంచి చేతబట్టుకుని 'రామారావుగారుండే యిల్లు యిదేనాండీ' అన్నాడు. అతన్ని లోనికాహ్వానించి, రామారావును లేపింది జానకి.


రామారావు నిద్రలేచి తన పాతస్నేహితుడు సుబ్రహ్మణ్యాన్ని గుర్తించాడు. ఆవాళ సుబ్రహ్మణ్యానికి జానకి చేతిభోజనం లభించింది. అది దతో పూర్వపరిచయం వున్నట్లయితే, అందు కతను గర్వపడేవాడే!

ఆ సాయంత్రం సుబ్రహ్మణ్యం నిద్రనించి మూడున్నరకు లేచుకుని, వూళ్ళోపనులు చూచుకు వస్తానని వెళ్ళాడు.


ఆ తర్వాత నాలుగున్నర గంటలకు రామారావు క్లబ్బుకేసి నడిచాడు మనసుండబట్టక! జానకి వక్కతే యింట్లోవుంది ఈ విషయంలో అతనికి యేమీ అనుమానంవున్నట్లు కనిపించదు. అయినా చేసేదేముంది వంటరి సంసారాలయినప్పుడు.

రామారావు తిరిగి ఆరుగంటలకు యిల్లు జేరుకునేసరికి సుబ్రహ్మణ్యం యింటోనే వున్నాడు. అప్పుడనుకున్నాడు రామారావు బజార్లో తిరిగినంతసేపూ వీడిసంగతే జ్ఞాపకం లేదేనని!

మామూలు స్నేహ మర్యాదలకు యేమీ ఆటంకం రాకుండా జరిగిపోయింది. భోజనం అయినాక, జానకి రామారావుకు తమలపాకులు చీల్చి యిస్తూంది. కాని స్నేహితుని మూలకంగా రామారావు, భార్యకు ఎక్కువ పని కల్పించ



మద్రాసులో హారిజన సేవక సంఘంవారు నడుపుతున్న స్కూలు పిల్లలకు మొన్నటి దీపావళినాడు ప్రధాన మంత్రి కొత్త బట్టలు కానుక యిస్తున్న దృశ్యం.



వల్పుగో లేదు గాబోలు (!) - యిద్దరూ అయిదు నిముషాల్లో బయటకు వెళ్ళి కిళ్ళీలు నములుతూ యిల్లు జేరుకున్నారు.

ఇప్పటికి జానకి వసారాలో స్నేహితులిద్దరికీ రెండు పరుపులు వేసింది.

రామారావు వసారాలో పడుకోబోతూ ముఖం బెట్టి 'నువ్వు గూడా, వసారాలో మంచం వేసుకోక పోయావా?' అన్నాడు. జానకి మామూలుగానే 'ఛా, నే నింట్లోనే పడుకుంటా' నన్నది.

ఆ రాత్రి ఒకంతట నిద్రపట్ట లేదు. కాని చివరకు పట్టిన మూడు గంటలూ దిట్టమయిన నిద్ర పట్టింది వాళ్ళకు తెలియకుండా. తక్కిన కాలమంతా కలతనిద్రే. అమూడుగంట లయినా అతని యిష్టానికి వ్యతిరేకమే నేమో అయినా, అక్కడికే వాళ్ళు పరవశమై పోయింది.

* * *

మరునాడుదయానే జానకి మామూలుగా యింటిపనుల్లో నిమగ్న అయింది.

సుబ్రహ్మణ్యం రైలుపంచి పట్టుకుని రామారావుతో 'ఇప్పుడు యేడున్నరకో రైలుబండి వుంది. వెళ్ళొస్తాను- సెలవు లేదు' అన్నాడు.

ఇంతలో జానకి భర్తను యింటోకి పిలిచింది. 'మీ స్నేహితుడిని, భోజనం అయి నాక పదిగంటల బండికి వెళ్ళమనరాదూ' అంది మర్యాదస్తురాల్లా. రామారావు సుబ్రహ్మణ్యం దగ్గర అదేమాట ప్రస్తావించాడు. అతని బలవంతాన్నే, సుబ్రహ్మణ్యం ఆ రోజు పది గంటలగ్గాని, రైలుబండిని చూడలేదు. జానకి రామారావుల చర్య-సుబ్రహ్మణ్యం వచ్చినందు వల్ల ఏమీ ఆటంకం కలగ లేదుగాని అతని చూపు ఆమెను పరీక్షిస్తున్నట్టుగా వుంది.

సుబ్రహ్మణ్యం వాళ్ళ వూరు చేరుకున్నాక వుత్తరం రాశాడు. దాన్లో 'నా చెల్లెలికి శుభా కాంక్షలు అందించు' అన్నాడు. ఆ వుత్తరం పట్టుకుని రామారావు జానకి దగ్గర శిలా ప్రతిమలా నుంచుండి పోయాడు.

* * *

యథావిధిగా అతని చదువు సంసారం, సాగి పోతున్నాయ్. పరీక్షల తారీకు రానూవచ్చింది పోనూపోయింది. అతననుకున్న విధంగా ఇంటరు ప్యాసవనూ అయ్యాడు. తరువాతి పరీక్షలకు పోవటానికి ప్రయత్నాలూ జరిపాడు.

జానకి సంతోషించింది. జానకిని చూచి రామారావూ సంతోషించాడు. ఇంతలో శ్యామల వచ్చింది వాళ్ళింటికి. జానకి ఆమెతో మాట్లాట్టానికని అవతల గదిలోకి వెళ్ళింది. శ్యామల తెచ్చిన వృత్తాంతం- తన భర్తకు యిన్సూరెన్సు కంపెనీవాళ్ళు అయిదు వేలు బోనసు యిచ్చారన్న ముక్క ! ఆ డబ్బుతో శ్యామల కాసులపేరు చేయించుకుంటానంది. ఇంకా రెండు మూడు నగల పేర్లు చెప్పిందిగాని, అవి జానకి గుర్తు పెట్టుకోలేదు.

రామారావు యీ విషయం విని ఏమీ ఆశ్చర్యపడ లేదు.

జానకి మాత్రం శ్యామలభర్త ఆదారిని వెళ్తూంటే- తేరిపారజూచింది, వాళ్ళిద్దరి చూపులూ కలుసుకోవటం రామారావు గమనించాడు,

అశక్తాంటి మేఘాలను రాచుకుంటూ వచ్చిన గాలివిసురుకు జానకి, రామారావు ఒకచోట చేరారు.